క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



చందనం అరగదీస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందజేశారు. కాగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆలయంలో చందనాన్ని అరగదీశారు.

చాతుర్మాస వ్రత మహోత్సవాలు ప్రారంభం



సాధుమఠం ప్రాంగణంలో మొక్క నాటుతున్న శ్రీనివాసానంద సరస్వతి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

పెందుర్తి: స్థానిక శ్రీ రామానంద జ్ఞానానంద సాధుమఠంలో ఏకాదశి సందర్భంగా చాతుర్మాస వ్రత మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ముందుగా మఠంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, రాంపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, మాజీ ఎంపీటీసీ వెన్నెల సన్యాసినాయుడు, సాధుమఠం చైర్మన్ బోకం జ్ఞానేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అన్నంరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: సుజాతనగర్ దరి నాగమల్లి లేఅవుట్ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్ సీ–1, సీ–2, కార్మికనగర్, గిరిప్రసాద్‌నగర్ 1,2,3, వెంకటాద్రినగర్, డాక్‌యార్డులేవుట్, టీచర్స్‌లేఅవుట్, నాగమల్లినగర్, ఆంజనేయులునగర్, సుజాతనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 పరిధి 33/11కేవీ అంతకాపల్లి సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ బుధవారం ఒక ప్రకనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'సమగ్ర విచారణ చేపట్టాలి'

పరవాడ: పెదగంట్యాడ మండలం గంగవరంలో పీసీబీ అధికారులకు పట్టుబడిన ఫార్మా వ్యర్థ జలాల ట్యాంకర్ ఎక్కడి నుంచి వచ్చిందో సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయన వ్యర్థ జలాలను సముద్రంలో కలపడానికి తీసుకువెళుతున్న పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. వారి చర్యల వల్ల భూగర్భ జలాలు, సముద్ర జలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రసాయన వ్యర్థ జలాలను పారబోస్తున్న వారిని గుర్తించి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

పేదింటి విద్యాకుసుమాలు



- నియోజకవర్గంలో ట్రిపుల్ ఐటీకి 37 మంది ఎంపిక
- ఆనందం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు
- పేదరికమైనా ప్రోత్సాహంతో లక్ష్య సాధన వైపు అడుగులు

వారంతా నిరుపేద కుటుంబానికి చెందిన బాల,బాలికలు. అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించడంతో చదువులో రాణించారు. అలాంటి వారి భవితకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ట్రిపుల్ ఐటీలు దివిటీలుగా నిలిచాయి. వారిని అక్కున చేర్చుకున్నాయి. ఉన్నత ఆశయాలతో ఆ ఆణి ముత్యాలు ట్రిపుల్‌ఐటీల్లో అడుగుపెడుతున్నారు. ఉన్నతంగా స్థిరపడతామని వారంతా ధీమాగా చెబుతున్నారు.

పెందుర్తి/సింహాచలం/సబ్బవరం: ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులను ఉచితంగా అందించేందుకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి గొప్ప ఆశయంతో ట్రిపుల్ ఐటీలను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వీటిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ పూర్తి చేసిన వారు మంచి ప్యాకేజీలతో మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ, కృష్ణా జిల్లా నూజివీడు, ప్రకాశం జిల్లా ఒంగోలు, శ్రీకాకుళంలో ఈ ట్రిపుల్ ఐటీ లున్నాయి. నాలుగు కేంద్రాల్లో మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన వారికి 92.99 శాతం, ప్రైవేటు పాఠశాలల్లో చదివి బీపీఎల్‌కు దిగువన ఉన్నవారికి 7.01 సీట్లు కేటాయిస్తున్నారు. ట్రిపుల్ ఐటీలు ప్రారంభించినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తున్నాయి.

ఎంపికైన విద్యార్థుల వివరాలివీ..

ప్రాంతం	విద్యార్థుల సంఖ్య
పరవాడ	16
పెందుర్తి	08
సబ్బవరం	01
సింహాచలం	12

చాలా ఆనందంగా ఉంది



నాకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ లేదా అగ్రికల్చర్ చదివి ప్రభుత్వ ఉద్యోగం చేయాలని ఉంది. నేను అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదోతరగతి చదివా. నాన్న ఈశ్వరరావు సేల్స్ మెన్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నేను ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాను.

– ఇమంది శ్రావణి, జిల్లా పరిషత్ హైస్కూల్, అడవివరం

తల్లిదండ్రుల కష్టాన్ని మరిపిస్తాను



మా నాన్న తాతారావు కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు. నేను గొరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివాను. పదోతరగతిలో 571 మార్కులు సాధించాను. ఇప్పుడు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. కష్టపడి చదివి మంచి ఉద్యోగం పొందాలన్నది నా కోరిక. నా తల్లిదండ్రుల కష్టానికి నేను ఇచ్చే గిఫ్ట్ అదే.

– లక్కోజు ప్రవల్లిక, గొరపల్లి, పెందుర్తి మండలం

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా



మా నాన్న నరసింహమూర్తి చిన్న హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నారు. నేను పదో తరగతిలో 585 మార్కులు సాధించాను. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించడం ఆనందంగా ఉంది. అక్కడ బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతాను. నా తల్లిదండ్రులను బాగా చూసుకుంటాను.

– ఎల్.సోమశేఖర్, మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల, సింహాచలం

ఉన్నతంగా స్థిరపడాలన్నదే లక్ష్యం



మా నాన్న సోములు వ్యవసాయం చేస్తారు. అమ్మ లావణ్య కూలిపనులకు వెళుతుంది. సబ్బవరం కేజీబీవీలో పదో తరగతి చదివి 569 మార్కులు సాధించాను. శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. భవిష్యత్‌లో బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయి స్థిరపడాలన్నదే నా లక్ష్యం.

– లోకారపు మౌనిక, కేజీబీవీ, సబ్బవరం

సింహగిరి.. భక్త ఝరి



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

- తొలి ఏకాదశి కావడంతో పోటెత్తిన భక్తులు
- విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: తొలి ఏకాదశి కావడంతో సింహగిరికి భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే అప్పన్న దర్శనానికి తరలివచ్చారు. గిరిపై ఎక్కడ చూసినా భక్తులు కిటకిటలాడారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి ఆలయ కల్యాణమండంపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ తులసీదళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం నేత్రపర్వంగా సాగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వెంకటాద్రిపై ఏకాదశి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



పూజలందుకున్న సత్యనారాయణస్వామి

పెందుర్తి: పవిత్ర తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం ఉదయం 6 నుంచి గురువారం ఉదయం 6 వరకు ఏకాహం ప్రారంభించారు. విష్ణు సహస్రనామ పారాయణ పఠించారు. భక్తులు తులాభారం సమర్పించారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి స్వామివారికి లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు.

సత్యనారాయణస్వామి సన్నిధిలో..

పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, రాజ ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సంగీత కచేరీ, కోలాటాలు, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఆనందగజపతిరాజుకు ఘన నివాళి



విద్యార్థి పూర్ణిమకు నగదు అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, సుధాగజపతిరాజు తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం దివంగత అనువంశిక ధర్మకర్త పూసపాటి ఆనందగజపతిరాజు జయంతిని బుధవారం సింహాచలం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆనందగజపతిరాజు చిత్రపటానికి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, కుమార్తె ఊర్మిళ గజపతిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పదోతరగతిలో 533 మార్కులు సాధించి సంస్కృతోన్నత పాఠశాల టాపర్‌గా నిలిచిన జె.పూర్ణిమకు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు రమణమూర్తి, రాజేంద్రకుమార్, ఏఈ హరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏయూ వీసీగా దళితుడికి అవకాశమివ్వాలి



మాట్లాడుతున్న పోరాట సమితి నాయకులు

సీతమ్మధార: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్(వీసీ)గా దళిత వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశమివ్వాలని దళిత హక్కుల పోరాట సమితి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డిమాండ్ చేసింది. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ ఏయూ వీసీ రాజీనామాను గవర్నర్ ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు కలిగిన ఎందరో ప్రతిభావంతులు, శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన ఘనత ఆంధ్ర యూనివర్సిటీకి ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ లాంటి గొప్ప వ్యక్తులను ఏయూ తయారు చేసిందని గుర్తు చేశారు. యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ వేయాలన్నారు. 25 ఏళ్లుగా ఓసీ, బీసీలకు చెందిన వారే వీసీలుగా ఉన్నారని, ఈ సారి దళితులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు.

45 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా. ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. కోల్‌కతాకు చెందిన జునైద్, ఎం.డి.ఇమ్రాన్, బెంగుళూరుకు చెందిన మహ్మద్ కలీద్‌లు బెంగళూరులోని విక్టోరియా హాస్పిటల్లో పనిచేస్తున్నారు. వీరు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి బెంగుళూరుకు తరలించే క్రమంలో విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. విచారణ అనంతరం ఈ ముగ్గురిని ఫోర్త్ టౌన్ పోలీసులకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించారు. వీరి వద్ద నుంచి 45 కిలోల గంజాయి, రెండు సూట్‌కేసులు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళా ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



ఏఈవో నరసింగరావుకు చెక్కు అందజేస్తున్న దాత



చందక లక్ష్మి దంపతులకు బాండ్ అందజేస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు.ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు దంపతులు రూ.1.10 లక్షలు ఏఈవో ఎస్.ఆనంద్ కుమార్‌కు, నగరంలోని మహరాణిపేటకు చెందిన వి.సూర్య ఉమా భారతి అనే దాత రూ.లక్ష విరాళాన్ని అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకి అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ప్రార్థన చేస్తున్న ముస్లింలు

పరవాడ: ముస్లింలు మొహర్రంను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింల విశ్వాసం ప్రకారం ఇది గొప్ప మాసం. రావాడ శివారు గొల్లగుంట గ్రామంలో పీర్ల కొట్టాం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పీర్లకు నైవేద్యం సమర్పించి ఫాతియా ధువా పఠనంతో ముగించారు.

శ్రీ విద్య ఉపాసన తరగతులు ప్రారంభం



శ్రీ విద్య ఉపాసన తరగతుల్లో చేరిన దేశ విదేశాలకు చెందిన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శ్రీ విద్య ఉపాసనలో మిడ్ లెవెల్ కోర్స్ బుధవారం ప్రారంభించినట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఈ శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చిన 16 మందికి విద్యార్థులకు గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా గురుమంత్ర దీక్ష ఇచ్చి తరగతులు ప్రారంభించారు. దీక్షలో సౌదీ అరేబియా,యూఎస్ఏ తో పాటు దేశంలోని వివిధ నగరాల నుంచి వచ్చిన వారు పాల్గొన్నారు.

వెలుగులివ్వని హైమాస్ట్



వెంకటపతిపాలెంలో వెలగని వీధి దీపం

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ వెలగడం లేదు. అతి ప్రమాదకరమైన మలుపు వద్ద ఏర్పాటు చేసిన లైటు వల్ల ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం వెలగని కారణంగా మలుపులో అంధకారం రాజ్యమేలుతుంది. చీకటి పడితే ఇక్కడ మలుపులో ఎదురెదురుగా వస్తున్న వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులతో మూలుగుతున్న హైమాస్ట్ లైట్‌తో పాటు వీధిలైట్లు వేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

చీటీల నిర్వాహకులకు కౌన్సెలింగ్

సీపీ ఆదేశాలతో పోలీసుల చర్యలు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు అన్ని స్టేషన్లలో చీటీల నిర్వాహకులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ చేస్తున్నారు. గతంలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరు చీటీల నిర్వాహకులు బోర్డు తిప్పేయడంతో బాధితులు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తెలిసిందే. రోజువారీ కూలీలు, ఇతర వృత్తిదారులు తమ పిల్లల చదువులు, వివాహాలు వంటి అవసరాల నిమిత్తం చీటీలు వేస్తుంటారు. దసరా, సంక్రాంతి, వరలక్ష్మీ వ్రతం వంటి నగదు చీటీలు కడుతుంటారు.

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రజలు విశాఖకు వలస వచ్చి చిన్న చిన్న పనులు, వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని చీటీల రూపంలో పొదుపు చేసుకుంటున్నారు. వీరి బలహీనతను ఆసరాగా తీసుకుని కొందరు చీటీ నిర్వాహకులు అర్థాంతరంగా బిచాణా ఎత్తేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్య..

ప్రభుత్వ లైసెన్స్ లేని చీటీ నిర్వాహకులంతా చీటీలు వేయకుండా ముందు జాగ్రత్త చర్యగా అన్ని స్టేషన్లకు పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని సమాచారం. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా అటు ద్వారకా జోన్.. ఇటు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లలో చీటీల నిర్వాహకుల తాకిడి కనిపిస్తోంది. పోలీసులు వీరికి రోజూ కౌన్సెలింగ్ చేస్తున్నారు. ప్రతి నెలా ఎక్కడో ఒక చోట చీటీల నిర్వాహకులు బోర్డు తిప్పేయడం ఆనవాయితీగా మారిపోయింది. పలు ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ లైసెన్స్ తీసుకున్న తరువాతే చీటీలు నిర్వహిస్తుంటారు. కానీ నివాసాల మధ్య కొందరు చీటీల నిర్వాహకులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే దర్జాగా చీటీ పాటలు వేస్తూ.. అమాయక ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారింది.

మోసపోవద్దు.. మేల్కోండి

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో చీటీల నిర్వాహకులు ఎక్కువగా ఉన్నారని సమాచారం. ఎవరైనా చీటీల నిర్వాహకులు పాటదారులకు వెంటనే సొమ్ములు చెల్లించాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసులు నిర్వాహకులను హెచ్చరిస్తున్నారు. నగర సీపీ ముందు జాగ్రత్త చర్యగా చీటీల నిర్వాహకులను మొదట్లోనే కట్టడి చేస్తే మోసాలకు ఆస్కారం లేకుండా చేయొచ్చని యోచిస్తున్నారు. ప్రభుత్వ లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద చీటీలు వేసి మోసపోవద్దని ప్రజలకు పోలీసులు సూచిస్తున్నారు. చీటీలు వేసి మోసపోయిన తరువాత తమను ఆశ్రయించడం కన్నా.. ముందే మేల్కోవాలని పోలీసులు హితవు పలుకుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికురాలి తొలగింపు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో ఏళ్ల నుంచి తిష్టవేసి, నిర్వాసితులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఒప్పంద కార్మికురాలిని విశాఖ జాయింట్ కలెక్టర్ తొలగించారు. ఎస్డీసీ కార్యాలయంలో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరి, దందాలు చేసే బ్రోకర్లకు పెద్ద పీట వేస్తూ, నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని ఇటీవల సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారుల నివేదిక మేరకు రాజేశ్వరిని విధుల నుంచి తొలగించారని రామ అప్పారావు పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధుల తీరు బాధాకరం

అగనంపూడి: సార్వత్రిక ఎన్నికల తరువాత ఎన్నికైన ప్రజా ప్రతినిధుల తీరు బాధాకరంగా ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఎన్. రామారావు, శ్రీనివాస నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1252వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రకటనలకే పరిమితం కావడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. కేంద్ర మంత్రి రెండు మాసాల్లో ఉక్కుకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఉత్పత్తికి కావల్సిన వనరులు కల్పిస్తామని ప్రకటించారని, కానీ ఆ దిశగా కనీసం అడుగులు పడకపోవడంతో వారిలో ఆందోళన అధికమవుతోందన్నారు. ఈ పరిణామాల వల్ల విశాఖ ఉక్కు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. నాయకులు స్పందించాలని కోరారు.

యువకుడి మృతి



గణేష్ కుమార్ మృతదేహం

అగనంపూడి: ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు మూర్ఛవ్యాధితో పాటు గుండెపోటు కారణంగా మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ ఎర్రం నాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం ఒడిగి సమీపంలోని సురాయ్‌పూర్ గ్రామానికి చెందిన గణేష్ కుమార్ విశ్వకర్మ (23) ఉపాధి కోసం నెల రోజుల క్రితం అగనంపూడి వచ్చాడు. గణేష్ కుమార్ మిత్రులు అగనంపూడి గుల్లవానిపాలెంలో అన్నపూర్ణ వాషింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గణేష్‌కుమార్‌ను కూడా ఇదే పనిలో చేర్పించారు. దీంతో వారితో కలిసి నివాసముంటున్నాడు. బుధవారం రాత్రి మోటార్ సైకిల్ కడుగుతుండగా, మూర్ఛ వచ్చి పడిపోవడంతో గణేష్ మిత్రులు వెంటనే సమీపంలోని అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మూర్ఛతో పాటు గుండెపోటు రావడంతో మృతి చెందాడని ధ్రువీకరించారు. సంఘటనా స్థలానికి సీఐ ఎర్రం నాయుడు చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.